## క్లుప్తంగా

### ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని న్యూమధురాపురి కాలనీలో బంగారు మైసమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నవారు మల్లారెడ్డి, ఏదుల్ల ప్రతాప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వినోద్‌నాయక్, పోరెడ్డి సురేందర్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయకహిల్స్–2 కాలనీలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ పి.సరస్వతికి ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. సీసీరోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆరెంపుల శ్రీనివాస్ తదితరులున్నారు.

### అధ్యాపకులకు సన్మానం



డాక్టరేట్ పొందిన అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మంగరాజు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు ఇద్దరు పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. ఆ కళాశాలలో పనిచేసే ఫిజికల్ డైరెక్టర్ ఎం.పర్వతాలుగౌడ్ ఎస్వీ యూనివర్సిటీ ఢిల్లీ నుంచి పీహెచ్‌డీ పొందారు. మరో హిందీ అధ్యాపకురాలు వై.శారద ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్నారు. దీంతో బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ మంగరాజు ఆధ్వర్యంలో వారిద్దరినీ ఘనంగా సన్మానించి సత్కరించారు. వారి సేవలు కళాశాలకు అందడం మన విద్యార్థులకు ఎంతో గర్వకారణమని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

నాగోలు: నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని బ్యాంక్ ఆఫ్ బరోడా రిజనల్ మేనేజర్ సుగుణావతి అన్నారు. బుధవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుగుణావతి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బందికి ప్రధానోపాధ్యాయులు అంజనేయులు కృతజ్ఞతలు తెపారు.

### విద్యాహక్కు, పోక్సో చట్టాలపై అవగాహన

మలక్‌పేట: మలక్‌పేటలోని ప్రభుత్వ ఎస్టీ బాలుర హాస్టల్లో బుధవారం హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిటీసివిల్ కోర్టు ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ జడ్జి కిరణ్మయి హాజరై విద్యాహక్కు, పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు ఎలా పొందాలో వివరించి, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లోని సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు బి. సురేష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నిధులు లేక.. నీరసించి

- మహిళాశక్తి భవన నిర్మాణానికి గ్రహణం
- రూ.25 లక్షలు విడుదల
- మరిన్ని నిధులు కేటాయిస్తేనే పూర్తి



అసంపూర్తి నిర్మాణంతో మహిళా శక్తి భవన్

బడంగ్‌పేట్: మహిళలను, మహిళా సంఘాలను బలోపేతం చేసి, ఆర్థికాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా మహిళా శక్తి భవనం పేరుతో మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన స్థలంలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గతేడాది నవంబర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శరవేగంగా పనులు కొనసాగినప్పటికీ.. తొలుత చివరి కౌన్సిల్ సమావేశంలో కేటాయించిన నిధులు రూ.25 లక్షలు సరిపోని నేపథ్యంలో గుత్తేదారు నిర్మాణ పనులు నిలిపివేశారు. మరో రూ.10 లక్షలు విడుదల చేస్తేకాని పనులు పూర్తికావన్నట్లు సమాచారం.

**మొదట సబ్ రిజిస్ట్రేషన్..**

నిర్మాణ పనులు కొనసాగేటప్పుడు ఈ భవనాన్ని మొదట సబ్ రిజిస్ట్రేషన్ చంపాపేట్ కార్యాలయానికి అని కేటాయించారు. ఈ కార్యాలయానికి ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు రాలేదో? లేక రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబర్ల సమస్య కొలిక్కి రాలేదో కానీ.. అదే భవనం ప్రస్తుతం మహిళాశక్తి పేరిటే ఉంది.

**అనంతరం ఠాణాకు**

కార్పొరేషన్‌లో సుమారు 3 లక్షల జనాభా, లక్షకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు నాలుగు దిక్కుల నుంచి ప్రజలు వస్తున్నారు. మీర్‌పేట్, బాలాపూర్, ఆదిబట్ల, పహాడీషరీఫ్ నాలుగు పోలీస్‌స్టేషన్ల లిమిట్స్‌లో కార్పొరేషన్ కొనసాగుతోంది. పలు స్టేషన్ల పరిధిలో ఉన్న బడంగ్‌పేటకు ఠాణా ఏర్పాటు చేయాలని పాలకులు సంకల్పించారు. ఉత్వర్వులు సైతం మంజూరు అయ్యాయి. ఎలాగూ ఠాణాకు పక్కా భవనం కావాల్సిందేనని పేర్కొంటూ.. శక్తి భవనాన్ని కేటాయించారు. ఇంకా ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

**మరే శాఖకో?**

మహిళాశక్తి పేరిట శంకుస్థాపన చేసినప్పటికీ.. తొలుత సబ్‌రిజిస్ట్రార్, అనంతరం పోలీస్‌స్టేషన్‌కు కేటాయించాలని భావించారు. కారణాలు ఏమైనప్పటికీ.. ఆ రెండు శాఖలకు కేటాయించలేదు. మరి ఈ మూడింటిలో దేనికో ఓ దానికి ఇస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. కానీ దేనికి ఇవ్వకుండా, నిధుల లేమితో నిర్మాణ పనులు ఆగిపోయాయి.

**పూర్తి చేయిస్తాం..**



నిధులు సరిపోక భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇదే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి అనుమతితో ఎస్టిమెట్ చేయించి, నిధులు వచ్చేలా చూస్తాం. అనంతరం నిర్మాణ పనులు పూర్తి చేయించి, వినియోగంలోకి తెస్తాం.

– హరీశ్, ఏఈఈ

సంబంధిత అధికారులు స్పందించి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా భవనం నిర్మాణం పూర్తి చేయించి, వినియోగంలోకి తేవాలని ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

## రేషన్ దరఖాస్తుల విచారణకు సహకరించాలి

హుడాకాంప్లెక్స్: రేషన్‌కార్డుల దరఖాస్తుల విచారణకు రెవెన్యూ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సరూర్‌నగర్ మండలం పరిధిలోకి వచ్చే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పౌర సరఫరాల శాఖ అధికారులు చూస్తారని తెలిపారు. ప్రజలు రేషన్‌కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు విచారణ చేసి పౌర సరఫరాల శాఖ అధికారులకు నివేదిక అందజేస్తారన్నారు. విచారణ సమయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన వారి రేషన్‌కార్డులు మంజూరు కావన్నారు. పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లో నమోదు చేసేటప్పుడు దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ నంబర్‌లింక్ అయి ఉండటంతో వారికి సంబంధించిన స్థిర, చరాస్తుల వివరాలు తెలుస్తాయన్నారు. పౌర సరఫరాల శాఖ నుంచి సరూర్‌నగర్ మండలానికి 9,500 దరఖాస్తులు విచారణ కోసం వచ్చాయని తెలిపారు. వాటిలో దాదాపు 25శాతం దరఖాస్తుల విచారణ పూర్తి చేశారని ఆయన తెలిపారు.

## అక్షరాస్యత సమాజాభివృద్ధికి పునాది

- వయోజన విద్యకు ప్రోత్సాహం
- ఎంపీడీఓ శైలజ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: అక్షరాస్యత సమాజ అభివృద్ధికి పునాది అని, వయోజన విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీడీఓ శైలజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఉల్లాస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యను ప్రోత్సహించడం ద్వారా సాక్షర భారత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. అక్షరాస్యత ప్రతి కుటుంబ అభివృద్ధికి దారి చూపే కాంతి అన్నారు. విద్య ద్వారా ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పెద్దల్లో చదువుపై ఆసక్తి పెంచి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కస్న నాయక్, ఏపీఎం సంతోష్, ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్ ఆనంద్ కుమార్, మహేశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలు ఐక్యతకు దోహదం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మధుయాష్కిగౌడ్

హయత్‌నగర్: గ్రామస్థాయిలో జరిగే పండుగలు ఐక్యతకు దోహదపడుతాయని అందరు ఏకతాటిపైకి వచ్చి బొడ్రాయి(నాభిశిల)స్థాపనకు ముందుకు రావడం శుభపరిణామం అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. బుధవారం హయత్‌నగర్‌లో నాభిశిల ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులంతా కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని గ్రామ సంక్షేమాన్ని కోరి నిర్వహిస్తున్న నాభిశిల ప్రతిష్ఠాపనకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కులమతాలకు అతీతంగా పండుగను వైభవంగా నిర్వహించాలని కోరారు. ఎంతో చరిత్ర కలిగిన హయత్‌నగర్‌లో అనేక దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు ఉన్నాయని, అన్ని వర్గాల పడుగలను కలిసి మెలసి జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఐక్యతను చాటుతుందన్నారు. కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామస్తుల క్షేమాన్ని కాంక్షిస్తూ ఎంతో కాలంగా బొడ్రాయిని స్థాపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇప్పటి గ్రామస్తులంతా పండుగను నిర్వహించేందుకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ముందుకు రావడం గొప్ప విషయం అన్నారు. అక్టోబర్ 9 నుంచి నాలుగు రోజులు ఈ పండుగను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బోడ భిక్షపతి, రవిందర్‌రెడ్డి, నాయకులు నక్క రవిందర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, నక్క దర్శన్‌గౌడ్, భాస్కర్, చెన్నగోని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## క్రీడా పాలసీతో క్రీడాకారులకు మేలు

మంత్రి వాకిటి శ్రీహరి



రన్‌లో పాల్గొన్న మంత్రి శ్రీహరి

దిల్‌సుఖ్‌నగర్: క్రీడా పాలసీతో ఎంతోమంది విద్యార్థులు, క్రీడాకారులకు మేలు చేకూరుతుందని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఖేల్ ఉత్సవ్ రన్ ను బుధవారం కొత్తపేట ఓమ్ని చౌరస్తాలో అయన మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ప్రారంభించారు. కొత్తపేట ఓమ్ని చౌరస్తా, ఎన్టీఆర్ నగర్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తానూ క్రికెట్ క్రీడాకారుడినని, తన చిన్నప్పుడు ప్రోత్సహించేవారు లేరని, ఆడుకోవడానికి ఆట స్థలాలు కూడా లేవని కానీ రాష్ట్ర ప్రభుత్వం నేడు విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీతో పాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. మధుయాష్కీ సూచన మేరకు సరూర్‌నగర్ స్టేడియంలో జిమ్ ఏర్పాటుకు రూ.2.50 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణలో క్రీడలను నిర్లక్ష్యం చేశారని యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రీడల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య దొంతి వినోద్ కుమార్, శ్రీపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పృథ్వీచౌదరి, లింగాల కిషోర్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, సురేందర్ రెడ్డి, మంజులా రెడ్డి, శశిధర్ రెడ్డి, సత్యనారాయణ, రామారావు, పాశం అశోక్ గౌడ్, పన్యాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని కాపాడాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేఎల్లార్

తుక్కుగూడ: ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో వినాయక చవితి పురస్కరించుకొని మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగులను ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలను వాడటం మూలంగా చెరువులు, కుంటలు, నదులు కలుషితమవుతున్నాయన్నారు. ప్రకృతిని కాపాడడానికి అందరూ కృషి చేయాలన్నారు. వినాయక చవితి సందర్భంగా భక్తులు ప్రస్తుతం వర్షాల మూలంగా విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు గోగికర్ జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

### నాలాల్లో గుర్రపుడెక్క తొలగించండి



మిథులానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: నాలాల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో ముంపునకు గురైన మిథులానగర్‌లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్



ఎల్‌ఈడీ వీధి దీపాలతో నాయకులు

కందుకూరు: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అండేకార్ సురేందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో రూ.5 లక్షల నిధులతో 70 ఎల్‌ఈడీ వీధి దీపాలను ప్రభుత్వం సరఫరా చేయగా.. కాంట్రాక్ట్ సంస్థ స్తంభాలకు బిగించే పనులు ప్రారంభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చొరవతో అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలతో సంబంధం లేకుండా అందరిని కలుపుకొని పోతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు గొరిగె రాజు, ఎడ్ల రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్

బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: రాష్ట్రంలో రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందని, పంటలకు యూరియా అందించకుండా వారి ప్రాణాలను బలిగొంటుందని బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు కన్నయ్యగారి బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ రైతులను ఎప్పుడు పట్టించుకోలేదని ఆరోపించారు. గత నెలలో వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను కనీసం పరామర్శించలేకపోయారన్నారు. కాంగ్రెస్ నాయకులు గోదాముల్లో యూరియాను నిల్వచేసుకొని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సమయానికి రైతుబీమా, యూరియా అందిస్తుందన్నారు. రుణమాఫీ పూర్తిగా చేయకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. వారి వెంట నాయకులు మాసన్నగారి వెంకట్‌రెడ్డి, సురసాని భూమిరెడ్డి, చిలుకల రఘునందన్, కళ్లెం సుధాకర్‌రెడ్డి, సామల దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ 20వ వార్డులో డెంగీ సోకిన బాలుడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో నీరు నిల్వ ఉండే కొబ్బరి చిప్పలు, పాత టైర్లను పడేయాలన్నారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ తరఫున దోమలు వృద్ధి చెందకుండా టెమోఫాస్ మందును పిచికారీ చేయడంతో పాటు ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, పార్టీ యూత్ అధ్యక్షుడు సాదపు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో కంప్యూటరీకరణతో పాటు ఐటీ రంగానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. దేశ భవిష్యత్‌కు ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. అందరూ ఆయన చూపిన బాటలోనే నడవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుండ్ర సుధాకర్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, మోటే రమేశ్, బుక్క పాండురంగారెడ్డి, ఎడ్ల కృష్ణ, బొక్క సంజీవరెడ్డి, గాదె కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఫయాజ్, నిరంజన్, నవీన్‌కుమార్, చందం శ్రీకాంత్, సంతోష్, వెంకటరమణ, మహేందర్, రాజశేఖర్‌రెడ్డి, వరికుప్పల శివ పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి



రాజాకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

నాగోలు: సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య కోరారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు వచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్ మైన్స్ పెన్షన్ స్కీం–1998 ప్రకారం కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారు. ఈ పథకం ప్రవేశపెట్టి 27 సంవత్సరాలు గడిచినా కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున కోల్ మైన్స్ పింఛన్ స్కీం–1998 చట్టాన్ని సవరించి బొగ్గు పెన్షనర్లకు గౌరవప్రదమైన జీవితం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సారయ్య, వంగవెంకట్, దమ్మలపాటి శేషయ్య, వీరస్వామి ఉన్నారు.

## వైభవంగా మైసమ్మ బోనాలు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: గడికోట మైసమ్మ బోనాల పండుగ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పాలంకరణ, మంత్ర పుష్పం పూజలు నిర్వహించారు. బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు నెత్తిన బోనంతో.. డప్పు చప్పుళ్ల నడుమ పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా.. మైసమ్మ సన్నిధికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య ముదిరాజ్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, ఆలయ మాజీ చైర్మన్ ఎం.నవీన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.ఆనందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్లు బాలయ్య, ప్రభాకర్, వీరుబాబు, జంగయ్య, లాజర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు